కలం
ప్రజల గళం...
kalamdaily.com
Follow on: Kalamtelugu
మంగళవారం • 21-04-2026
పేజీలు: 4

## 360° SINGLE TOPIC
### ఆర్టీసీ సమ్మె



# ఆర్టీసీకి ఏదీ గ్యారంటీ?

స్వరాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులతో
## పాలకుల ఆటలు

నాడు బీఆర్ఎస్.. నేడు కాంగ్రెస్
## సేమ్ టు సేమ్

- 2019లో సమ్మెకు దిగారని దూషించిన కేసీఆర్
- కలత చెంది ప్రాణాలు విడిచిన 34 మంది కార్మికులు
- కాంగ్రెస్ ఏడో గ్యారంటీ 'ప్రజాస్వామ్యం' మాటలకే పరిమితం
- రెండేండ్లు దాటుతున్నా ట్రేడ్ యూనియన్ల పునరుద్ధరణే లేదు
- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కాగితాలకే..!
- కొత్త రిక్రూట్‌మెంట్లు లేవ్.. పాత బకాయిల విడుదలా లేదు
- ఎలక్ట్రిక్ బస్సుల రాకతో ఉద్యోగాలకు ఎసరు
- ఈ నెల 22 నుంచి ఆర్టీసీ కార్మికుల నిరవధిక సమ్మె

'ప్రజల రథం.. ప్రగతి పథం'.. ఇదీ తెలంగాణ ఆర్టీసీ నినాదం. కానీ ఆర్టీసీలో, ఆ సంస్థ కార్మికుల జీవితాల్లో ప్రగతి మాత్రం లేదు. ఆర్టీసీ పురోగతి ఒక అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్నట్టుగా తయారైంది. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, శ్రామిక్‌లు.. ఇలా కార్మికులే ఉండే ఈ సంస్థలో ట్రేడ్ యూనియన్లే లేవు. గత ప్రభుత్వంలో కేసీఆర్ పుణ్యమా అని అవి రద్దయ్యాయి. ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్యం అని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి రెండున్నరేండ్లయినా పునరుద్ధరణ లేదు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ప్రధానమైనవన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల పాత్రను మరువలేం. సుదీర్ఘమైన సమ్మెతో రాష్ట్ర ఏర్పాటులో వారి పాత్ర తెలంగాణ ప్రజలకు స్వీయానుభవం. స్వరాష్ట్రంలో సమస్యలు తీరుతాయని, హక్కులు లభిస్తాయని గంపెడాశలు పెట్టుకున్నారు. కానీ కేసీఆర్ హయాంలో ఆర్టీసీ కార్మికుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లయింది. డిమాండ్ల పరిష్కారం సంగతేమో గానీ వారికి అప్పటివరకూ ఉన్న 'గుర్తింపు యూనియన్' హక్కు కూడా లేకుండాపోయింది.

కొత్త ప్రభుత్వంలోనైనా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశించిన ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు సమ్మె తప్ప మరో మార్గం లేకుండా పోయింది. కేసీఆర్ హయాంలో 52 రోజుల సమ్మె కాలంలో 34 మంది చనిపోయారు. రిటైర్ అయిన ఉద్యోగుల స్థానంలో రిక్రూట్‌మెంట్లు లేవు. డ్రైవర్లు, కండక్టర్లపై పని ఒత్తిడి పెరిగింది. 8 గంటల పని విధానం స్థానంలో ఎక్కువ గంటలు పనిచేయాల్సి వస్తున్నది. గత ప్రభుత్వంలో అమలైన 'విభజించు-పాలించు' విధానమే ఇప్పుడూ కొనసాగుతున్నది.

కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్తవి లేవు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ప్రైవేట్ సంస్థలు చొచ్చుకొచ్చాయి. చాలా డిపోల్లో 'హైర్ బస్' సిస్టమ్ కంటిన్యూ అవుతున్నది. 2017, 2021 పీఆర్సీ బకాయిల పేమెంట్ ఊసే లేదు. 2017 పీఆర్సీ ప్రకటించినా అలవెన్సులు అందలేదు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ప్రతిపాదన కమిటీల పేరుతో కాలయాపన అవుతున్నది. మెడికల్/అన్‌ఫిట్/డెత్ స్టాఫ్ పిల్లలకు రెగ్యులర్ ఉద్యోగాల డిమాండ్ పెండింగ్‌లోనే ఉన్నది. ఇలాంటి అనేక డిమాండ్లతో ఆర్టీసీ కార్మికులు ఈ నెల 22 నుంచి సమ్మెకు దిగాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో కలం 360 డిగ్రీస్ స్పెషల్...

- తెలంగాణ బ్యూరో, కలం

## మలిదశ ఉద్యమంలో మరపురాని పాత్ర

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2011లో జరిగిన 'సకల జనుల సమ్మె'లో ఆర్టీసీ కార్మికులు వెన్నెముకలా నిలిచారు. దాదాపు 27 రోజులు బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. సీమాంధ్ర పాలకుల పాలనను స్తంభింపజేశారు. ఆ సమయంలోనే ఉద్యమ నాయకుడిగా చెప్పుకున్న కేసీఆర్ ''తెలంగాణ వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తాం. కార్మికులను కడుపులో పెట్టుకుని చూసుకుంటాం'' అని హామీ ఇచ్చారు. ఈ మాటలు కార్మికుల్లో ఉత్సాహాన్ని పెంచాయి. స్వరాష్ట్రం ఏర్పడితే డిమాండ్లు, సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఆశలు పెట్టుకున్నారు. నాలుగేండ్లు తిరగ్గానే ఆర్టీసీ కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లయింది.



తెలంగాణ ఉద్యమంలో భాగంగా 2011లో జేబీఎస్‌లో ఆర్టీసీ కార్మికుల ర్యాలీ



## 2019 సమ్మె.. సర్కారు అణచివేత, ఆంక్షలు

బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు 2019 అక్టోబర్ 5 నుంచి నవంబర్ 25 వరకు 52 రోజుల పాటు సమ్మె చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి... 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని అమలు చేయాలి.. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి.. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను చెల్లించాలి.. కారుణ్య నియామకాలను కల్పించాలి.. మెడికల్ / అన్‌ఫిట్ ఉద్యోగులను ప్రత్యామ్నాయ పోస్టుల్లో నియమించాలి.. తదితర మొత్తం 26 డిమాండ్లతో సమ్మె చేశారు. ఈ సమ్మెను కేసీఆర్ ప్రభుత్వం అక్రమమని ప్రకటించి గడువులోగా విధుల్లో చేరని 48,000 మందిని ''సెల్ఫ్ డిస్మిస్'' అని ప్రకటించింది. కార్మికులకు జీతాలను నిలిపివేసి, డిపోల దగ్గర పోలీసు పికెట్లను ఏర్పాటు చేసింది. సమ్మె కాలంలో 34 మంది కార్మికులు చనిపోయారు.

## నోటికొచ్చినట్లు అనేసిన కేసీఆర్

ఆర్టీసీ కార్మికుల సమ్మెపై నాడు సీఎం హోదాలో కేసీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. హెచ్చరికలు జారీ చేశారు. ఆయన మాటలు కార్మికులను తీవ్ర మనోవేదనకు గురిచేశాయి. ''సమ్మె కొనసాగిస్తే ఆర్టీసీనే మూసేస్తాం. ఆర్టీసీని ఎవరూ కాపాడలేరు. ఆ సంస్థకు భవిష్యత్తే లేదు. సమ్మెలో పాల్గొన్న దాదాపు 48వేల మంది కార్మికులు డ్యూటీకి రాకపోవడం వల్ల ఉద్యోగాలు కోల్పోయినట్టే. డెడ్‌లైన్ లోపు డ్యూటీకి రాకపోతే కొత్త ఉద్యోగులను తీసుకుంటాం. వాళ్లు కూర్చున్న కొమ్మను వాళ్లే నరుక్కుంటున్నారు. కార్మికుల గొంతును యూనియన్ నేతలు కోస్తున్నారు. ఇక యూనియన్లు ఉండనే ఉండవు. సమ్మె కొనసాగిస్తామంటే చూస్తూ ఊరుకోం. ప్రైవేట్ ఆపరేటర్లను వాడుతాం. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేసే ప్రసక్తే లేదు''.. ఇలా ఎన్నో కామెంట్లు ప్రెస్‌మీట్‌లో నాడు కేసీఆర్ చేశారు. కొందరు ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడానికి నాటి ముఖ్యమంత్రి కామెంట్లే కారణమన్న వాదన ఇప్పటికీ ఉంది.





## కోర్టులో ఉపశమనం.. కఠిన నిర్ణయం

ప్రభుత్వ చర్యను సవాలు చేస్తూ ఆర్టీసీ కార్మిక సంఘాలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాయి. సమ్మెకు దారితీసిన కారణాలను వివరించడంతో పాటు న్యాయమైన సమస్యలకు పరిష్కారాన్ని కోరాయి. విచారణ సందర్భంగా ఆర్టీసీకి ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలపై కోర్టు ప్రశ్నల వర్షం కురిపించింది. చర్చల ద్వారా పరిష్కారాన్ని కనుగొనాలని సూచించింది. సమ్మెను 'అక్రమం' అని ప్రకటించడానికి హైకోర్టు నిరాకరించింది. సమ్మె విరమించే వరకు చర్చలు జరిపే ప్రసక్తే లేదని ప్రభుత్వం మొండికేసింది. సుదీర్ఘంగా జరిగిన విచారణలో కార్మికులకు ఉపశమనం కలిగించే ఓరల్ ఆర్డర్స్ వెలువడినా చివరకు కార్మికులు సమ్మెను విరమించి ప్రభుత్వంతో చర్చలకు సిద్ధపడాలని కార్మిక సంఘాలకు, ప్రభుత్వానికి హైకోర్టు సూచనలు చేసింది. హైకోర్టు తీర్పుతో కార్మికులు 2019 నవంబర్ 26న సమ్మెను విరమించి విధుల్లో చేరక తప్పలేదు.



## సమ్మె విరమణతో ప్రగతిభవన్‌లో విందు

హైకోర్టు ఆదేశాలతో కార్మిక సంఘాలు సమ్మె విరమించడంతో కేసీఆర్ అహం చల్లారింది. రెండు రోజులకే (2019 నవంబర్ 28న) రాష్ట్ర కేబినెట్ సమావేశాన్ని నిర్వహించి 'బేషరతు'గా ఆర్టీసీ సిబ్బందిని విధుల్లోకి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత 2019 డిసెంబర్ 1న అధికారిక బంగళా ప్రగతి భవన్‌కు అన్ని డిపోల నుంచి సుమారు 2,500 మంది కార్మికులని పిలిపించుకుని విందు ఇచ్చారు. అప్పటివరకూ కార్మికులను హేళనగా మాట్లాడిన కేసీఆర్ వరాలు కురిపించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చారు. విధుల నుంచి ఎవరినీ తొలగించబోమని భరోసా ఇచ్చారు. కార్మికులకు సెప్టెంబర్ నెల జీతంతో పాటు సమ్మె కాలం జీతాన్ని చెల్లిస్తామన్నారు. ప్రతీ బస్సు డిపోలో 'కార్మిక సంక్షేమ మండలి'ని ఏర్పాటు చేస్తామన్నారు. రిటైర్‌మెంట్ ఏజ్‌ను 58 నుంచి 60 ఏళ్లకు పెంచుతామన్నారు. ఆర్టీసీకి ప్రతీ బడ్జెట్‌లో ఏటా రూ. 1,000 కోట్లు కేటాయిస్తామన్నారు.

## బీఆర్ఎస్ హామీల అమలు నామమాత్రం

ముఖ్యమంత్రి హోదాలో 2019 డిసెంబర్‌లో కేసీఆర్ ఇచ్చిన హామీలు, వరాల్లో నామమాత్రమే అమలయ్యాయి. రిటైర్‌మెంట్ ఏజ్ 60 ఏండ్లకు పెరిగింది. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియ అమలుకు, పూర్తిస్థాయి ఆర్థిక ప్యాకేజీ ఇవ్వడానికి చాలా సమయమే పట్టింది. సరిగ్గా 2023 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు 'విలీన బిల్లు'ను అసెంబ్లీలో ఆమోదించి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. 2023 సెప్టెంబర్ 30ని 'అపాయింటెడ్ డే'గా ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ అయింది. కానీ అది ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఆర్టీసీ కార్మికులు ట్రేడ్ యూనియన్లు పెట్టుకోవడంపై ఇప్పటికీ ఆంక్షలు కొనసాగుతున్నాయి. గుర్తింపు సంఘమే లేకుండా పోయింది. పెండింగ్ పీఆర్సీ, డీఏల బకాయిల పేమెంట్ పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ప్రతీ డిపోలో సంక్షేమ మండలి ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది. మిగిలిన హామీలదీ అదే దారి.

## కాంగ్రెస్ హామీలూ 'ఎక్కడి గొంగళి అక్కడే' తీరు

ఆర్టీసీ కార్మికులకు తెలంగాణ కాంగ్రెస్ 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టో ద్వారా పలు హామీలు ఇచ్చింది. బీఆర్ ఎస్ ప్రభుత్వ కాలంలోని పెండింగ్ పీఆర్సీ, డీఏలను క్లియర్ చేస్తామని పేర్కొన్నది. రెండున్నరేళ్ల తర్వాత తాజాగా పెండింగ్ డీఏల బకాయిలను చెల్లించింది. 2017 పీఆర్సీని 21% ఫిట్‌మెంట్‌తో అమలు చేయడంతో 42 వేల మంది సిబ్బందికి, 53 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులకు రిలీఫ్ లభించినట్లయింది. 2021 పీఆర్సీ బకాయిలు మాత్రం యథావిధిగా పెండింగ్‌లోనే ఉండిపోయాయి. గత ప్రభుత్వంలోని కార్మికుల సీసీఎస్ నిధుల వినియోగం అంశంలో కదలిక లేదు. దాదాపు 12ఏండ్లుగా కొత్త డ్రైవర్లు, కండక్టర్ల నియామకం జరగలేదు. రాష్ట్రం ఏర్పడే నాటికి సుమారు 56 వేల మంది సిబ్బంది ఉంటే ఇప్పుడు అది 38వేలకు తగ్గింది. గడిచిన పుష్కర కాలంలో దాదాపు 19 వేల మంది రిటైర్ అయ్యారు. వారికి పూర్తిస్థాయిలో సెటిల్‌మెంట్ బెనిఫిట్స్ అందలేదు. ఉన్న సిబ్బందిపైనే భారం పడుతున్నది.



## 12 ఏండ్లుగా నో రిక్రూట్‌మెంట్స్

రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ ఆర్టీసీలో కొత్త రిక్రూట్‌మెంట్‌లు బందయ్యాయి. ప్రతి ఏటా సగటున 1,700 మంది రిటైర్ అవుతున్నారు. వారి స్థానాలన్నీ ఖాళీగానే ఉంటున్నాయి. 1150 మంది డ్రైవర్లను, 743 మంది 'శ్రామిక్'లను రిక్రూట్ చేసుకోడానికి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ ఇచ్చినా అది మెటీరియలైజ్ కాలేదు. మరో 1500 మంది కండక్టర్ల అవసరం ఉన్నదంటూ కార్మిక సంఘాలు ఆర్టీసీ యాజమాన్యానికి మొరపెట్టుకున్నాయి. ఇంకోవైపు ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు వర్కర్ల సంఖ్య పెరిగిపోతూ ఉన్నది. పన్నెండేండ్లలో దాదాపు ఐదున్నర వేల మంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో రిక్రూట్ అయ్యారు. కార్మికుల వివాదాల పరిష్కారానికి 'జెంటిల్‌మన్ అగ్రిమెంట్' కుదిరినా యాజమాన్యం పక్కన పెట్టింది.

## పీఆర్సీ ఫిట్‌మెంట్‌తోనూ దొరకని రిలీఫ్

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతి నాలుగేండ్లకోసారి వేతన సవరణ జరగాలన్నది నిబంధన. 2017 పీఆర్సీని ప్రభుత్వం అమలు చేసినా ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా 21% ఫిట్‌మెంట్ ఇచ్చింది. ఇందులో పాతది 16% ఉండడంతో అదనంగా వచ్చింది ఐదు శాతమేనన్నది సంఘాల వాదన. బీఆర్ఎస్ ప్రభుత్వం అరియర్స్ ఇవ్వలేదు. అలవెన్సులతో పాటు 'ఫ్రింజ్ బెనిఫిట్స్' పెంచలేదు. 2021, 2025 పీఆర్సీల ఊసే లేదు. కార్మికుల సహకార సొసైటీకి బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన సుమారు రూ. 600 కోట్ల వడ్డీతో కలిపి ఇప్పుడు వెయ్యి కోట్లయింది. దాన్ని ప్రస్తుత ప్రభుత్వం చెల్లించలేదుగానీ రెండేండ్ల నుంచి రావాల్సినవని మాత్రం రెగ్యులర్‌గానే అందుతున్నాయి.



## మహాలక్ష్మి స్కీమ్ అమలుతో చిక్కులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఒకటైన 'మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం' అనే మహాలక్ష్మి స్కీమ్‌ను మాత్రం అధికారంలోకి వచ్చిన రెండో రోజే అమల్లోకి తెచ్చింది. ప్రతి ఏటా క్రమం తప్పకుండా బడ్జెట్ నుంచి సబ్సిడీ రీయింబర్స్‌మెంట్ చేస్తామని చెప్పింది. ఆలస్యమైనా, కాస్త తక్కువైనా ఈ సబ్సిడీ పేమెంట్ కొనసాగుతున్నది. బస్సుల్లో ఆక్యుపెన్సీ పెరిగింది. రెండున్నరేండ్లలో దాదాపు 290 కోట్ల మంది మహిళా ప్రయాణికులకు 'జీరో టికెట్'లు జారీ అయ్యాయి. సంక్రాంతి, దసరా, మేడారం జాతర.. ఇలాంటి ప్రత్యేక సందర్భాల్లో స్పెషల్ బస్సు సర్వీసులతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. కండక్టర్లతో ఘర్షణలు రొటీన్ ప్రాక్టీసుగా మారాయి. ఆ మేరకు కండక్టర్లు, డ్రైవర్లపై మానసిక ఒత్తిడి పెరిగిందని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు.



## ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల అజమాయిషీ

పర్యావరణం పేరుతో ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కుతున్నాయి. ఆర్టీసీ పేరుతో ఈవీ బస్సులు నడుస్తున్నా అవేవీ ఆర్టీసీకి చెందినవి కావు. ప్రైవేటు సంస్థల నుంచి హైర్ చేసుకున్నవే. ఒక్కో కి.మీ.కు రూ. 58 చొప్పున అద్దె చెల్లించేలా ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకున్నది. ప్రస్తుతం నగరంలో 325 ఈవీ బస్సులు నడుస్తున్నాయి. వచ్చే ఏడాది చివరి నాటికి ఆర్టీసీలో మొత్తం 2,700 ఈవీ బస్సులు సమకూర్చుకోవాలన్నది రవాణా శాఖ ఉద్దేశం. బస్సుతో పాటే డ్రైవర్ కూడా ప్రైవేటు వ్యక్తే ఉంటారు. దీంతో రానున్న రోజుల్లో ఆర్టీసీ డ్రైవర్ల రిక్రూట్‌మెంట్ పూర్తిగా బంద్ అవుతుంది. చార్జింగ్ స్టేషన్లు, వాటి నెలవారీ నిర్వహణ ఆర్టీసీ గ్యారేజ్‌లలోనే నడుస్తున్నది. కాలం చెల్లిన ఆర్టీసీ బస్సుల స్థానంలో అన్నీ ఈవీ బస్సులు వస్తుండడంతో భవిష్యత్తులో ఆర్టీసీకి సొంత బస్సులే ఉండవని, దీంతో డ్రైవర్ పోస్టులూ ఉండవన్నది కార్మిక సంఘాల ఆందోళన.




## ఆర్టీసీ సొంత బస్సుల విధానానికి స్వస్తి

ఆర్టీసీలో గతంలో పది వేలకు పైగా బస్సులుంటే ఇప్పుడు ఆరు వేలకు తగ్గాయి. ఇందులోనూ చాలావరకు కాలం చెల్లినవి కావడంతో స్క్రాప్‌కు రెడీగా ఉన్నాయి. ఆర్టీసీకి కొత్తగా బస్సులు రావడం లేదు. ప్రైవేటు కంపెనీల నుంచి ఎలక్ట్రిక్ బస్సులు కాంట్రాక్టు పద్ధతిలో వస్తున్నాయి. క్రమంగా డిపోలను ఇవి ఆక్రమిస్తున్నాయి. ఉదాహరణకు హయత్‌నగర్ డిపోకు కొత్తగా వచ్చిన 100 బస్సులూ ప్రైవేటు ఈవీలే. హయత్‌నగర్ సహా మియాపూర్, కంటోన్మెంట్ డిపోలు ప్రైవేటుపరం అవుతాయని యూనియన్లు అనుమానిస్తున్నాయి. మూతబడిన డిపోలను ఈవీ బస్సులకు గ్యారేజ్‌లుగా వాడే అవకాశమున్నది. ప్రైవేటు ఈవీ బస్సులతో పాటే డ్రైవర్లూ వస్తున్నారు. ఆర్టీసీకి సొంత డ్రైవర్లు అవసరం లేని మెకానిజం డెవలప్ అవుతున్నది. డ్రైవరే కండక్టర్ పని కూడా చేస్తారు. టికెట్ ఇష్యూ వ్యవహారమంతా డ్రైవరే చూసుకుంటాడు. దీంతో ఆర్టీసీలో ఇకపైన డ్రైవర్లు, కండక్టర్ల రిక్రూట్‌మెంట్‌కు బ్రేక్ పడినట్లే.

## మరోసారి సమ్మెకు ఆర్టీసీ కార్మికులు

రాష్ట్ర సాధన ఉద్యమం టైమ్‌లో 27 రోజులు, 2019లో 52 రోజులు సమ్మె చేసిన ఆర్టీసీ కార్మికులు మరో సమ్మెకు సిద్ధమవుతున్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో జేఏసీ పేరుతో సమీకృతులవుతున్నారు. ఇప్పటికే లేబర్ కమిషనర్‌కు, ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ నెల 22 నుంచి నిరవధిక సమ్మెకు రెడీ అవుతున్నారు. ఇందుకోసం నిర్దిష్టమైన డిమాండ్లను కూడా పెట్టారు.

**ఇవీ డిమాండ్లు..**

- ఆర్టీసీ కార్మికులకు ట్రేడ్ యూనియన్ పెట్టుకునే హక్కు ఉండాలి. వాటికి ఎన్నికలు నిర్వహించుకునే స్వేచ్ఛ ఉండాలి. ప్రభుత్వం గుర్తింపు పొందిన యూనియన్‌ను గుర్తించాలి.
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి.
- పెండింగ్‌లో ఉన్న పీఆర్సీలను వెంటనే క్లియర్ చేయాలి.
- 2017 నాటి పీఆర్సీ 'ఫ్రింజ్ బెనిఫిట్స్', ఎరియర్స్ చెల్లించాలి.
- కార్మికుల పని గంటలను తగ్గించాలి. వేధింపులు ఆగిపోవాలి.
- సుదూర ప్రయాణాలకు (650 కి.మీ.) రెండో డ్రైవర్‌ను ఇవ్వాలి.
- కారుణ్య నియామకాలు, ఉద్యోగుల రెగ్యులరైజేషన్ జరగాలి.
- 2024 ఆగస్టు నుంచి రిటైర్డ్ ఉద్యోగుల గ్రాట్యుటీ చెల్లించాలి.



## అద్దె బస్సులతో మొదటి నుంచీ తలనొప్పి

ఉమ్మడి రాష్ట్రంలోనే ఆర్టీసీలో అద్దె బస్సుల విధానం మొదలైంది. ప్రేవేటు ఆపరేటర్లు డ్రైవర్‌తో కలిపి బస్సుల్ని అద్దెకు ఇస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళా సంఘాల నుంచి సమకూర్చుకోవాలనే నిర్ణయం జరిగింది. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా ప్రభుత్వం రుణాలు ఇప్పించి బస్సుల్ని కొనుగోలు చేసి ఆర్టీసీకి హైర్‌కు ఇవ్వాలన్నది ఈ విధానం. ఒకవైపు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామంటూ హామీలు ఇస్తున్న ప్రభుత్వాలు మరోవైపు ఆర్టీసీకి సొంత బస్సులే లేకుండా చేస్తున్నదని ట్రేడ్ యూనియన్లు ఆరోపిస్తున్నాయి. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించే ఆలోచనలు కార్యరూపం దాల్చకపోవడంతో ప్రభుత్వాల హామీలపై అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి. ఇంతకాలం అద్దె బస్సుల తలనొప్పి ఉండగా, ఇప్పుడు ఈవీ బస్సుల పెత్తనం పెరిగిందన్నది యూనియన్ల వాదన.

## సంస్కరణలెన్ని వచ్చినా సమస్యలు సేమ్

ఆర్టీసీలో సంస్కరణలు ఎన్ని వచ్చినా కార్మికుల సమస్యలు మాత్రం యథావిధిగా కొనసాగుతున్నాయి. అప్పటివరకు ఉన్న హక్కులు కూడా కేసీఆర్ హయాంలో కనుమరుగయ్యాయి. రిటైర్‌మెంట్ల స్థానంలో రిక్రూట్‌మెంట్లు లేకపోవడంతో సిబ్బంది సంఖ్య తగ్గింది. రాష్ట్రం ఏర్పడిన కొత్తలో 56 వేల మంది కార్మికులతో ఆర్టీసీ బస్సులు 30 లక్షల కి.మీ. తిరిగితే ఇప్పుడు 38 వేల మందితో 35 లక్షల కి.మీ. తిరుగుతున్నాయి. దాదాపు 60% మేర 'వర్క్ లోడ్' పెరిగిందన్నది కార్మిక సంఘాల వాదన. కొందరికి డబుల్ డ్యూటీలు భారంగా మారాయి. కంటిన్యూగా 16 గంటలు పనిచేయాల్సి వస్తున్నది. సెలవుల మంజూరులో ఆంక్షలు మొదలయ్యాయి. అడిగినవారికి మెమోలు, నోటీసులు తప్పడం లేదు. ఉన్నతాధికారుల నుంచి 'హరాస్‌మెంట్' పెరిగిందంటున్నారు.